ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 28 జూన్ 2024 | 5

ఏపీ పీజీసెట్ -2024 ఫలితాలు విడుదల

ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో పలువురికి పదిలోపు ర్యాంకులు

- వివరాలు 7లో



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

1 నుంచి పెన్షన్ల పంపిణీ పండుగ

- 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ రూ.4వేలకు పెంపు
- జిల్లాలో 2,43,529 మందికి రూ.160.89 కోట్లు కేటాయింపు
- సచివాలయ ఉద్యోగులతో లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ
- ఒక్కో ఉద్యోగి 50 మందికి చెల్లించేలా మ్యాపింగ్
- ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం: కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక భద్రతా పెన్షన్లను జూలై 1 నుంచి పంపిణీ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతా పెన్షన్‌ను మరో రూ.వెయ్యి పెంచి పథకం పేరును 'ఎన్టీఆర్ భరోసా'గా మార్చిందన్నారు. జూలై 1న పెన్షన్ల పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. దివ్యాంగులకు నెలకు రూ.3వేలు పెన్షన్‌ను రూ.6వేలుకు పెంచారన్నారు. జిల్లాలో 32,681 మంది దివ్యాంగులు పెన్షన్లు అందుకుంటున్నారని, వీరితో పాటు 122 మంది మల్టీడిఫార్మిటీ పెన్షన్ పొందుతున్నారన్నారు. పూర్తిగా దివ్యాంగత్వం కలిగిన వారికి పెన్షన్‌ను నెలకు రూ.5వేల నుంచి రూ.15వేలకు పెంచారని, తద్వారా 367 మందికి అదనంగా లబ్ధి చేకూరుతుందన్నారు. వీరితో పాటు 114 మందికి పక్షవాత పెన్షన్లు అందిస్తామన్నారు. మూత్రపిండాలు, తలసేమియా కేసులకు సంబంధించి 112 మంది పెన్షన్‌దారులకు రూ.5వేల నుంచి రూ.10వేలకు పెన్షన్ పెంచారన్నారు.

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2,43,529 మందికి జూలై 1న పెన్షన్లు అందిస్తామన్నారు. ఇందుకోసం రూ.160.89 కోట్లు జిల్లాకు మంజూరు చేశారన్నారు. పెన్షన్‌దారులకు గత మూడు నెలలకు సంబంధించి బకాయి రూ.3వేలతో కలిపి ఒక్కో లబ్ధిదారునికి రూ.7వేలు చొప్పున చెల్లిస్తామన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దారు, మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణలో గ్రామ సచివాలయాల ఉద్యోగులు, ప్రభుత్వ సిబ్బందిని పెన్షన్ల పంపిణీకి కేటాయించామని, ఒక్కో ఉద్యోగి 50 మందికి పెన్షన్లు చెల్లించే విధంగా మ్యాపింగ్ చేశామన్నారు. ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేస్తారు. అనివార్య కారణాల వల్ల మిగిలిపోయిన పెన్షన్‌దారులకు మరుసటి రోజున తప్పనిసరిగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

నగదును డ్రా చేసి భద్రపరుచుకోవాలి

పెన్షన్ల పంపిణీకి సంబంధించిన నగదును ఈ నెల 29నే బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకుని పోలీసుల సహకారంతో భద్రపరుచుకోవాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. నగదు మొత్తం ఎక్కువగా ఉన్నందున భద్రతాపరంగా పోలీసుల సహకారం అందిస్తామన్నారు. బ్యాంకర్లు సైతం 29వ తేదీ శనివారం ఉదయానికి నగదును సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పంపిణీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. బ్యాంకుల్లో నగదు డ్రా, తరలింపు అంశాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డేటాబేస్ ఆధారంగా పెన్షన్‌దారులు బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్స్, కౌంటర్‌ఫైల్, ప్రొపర్ ఎకనాలెడ్జ్‌మెంట్ ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీ వర్తింపు ఇలా...

వృద్ధాప్య 1,29,297	ఒంటరి మహిళలు: 4,557
వితంతు: 49,806	సంప్రదాయ చెప్పులు కుట్టేవారు: 726
చేనేత కార్మికులు: 5,252	ట్రాన్స్‌జెండర్లు: 20
కల్లుగీత కార్మికులు: 3,241	డప్పు కళాకారులు: 741
మత్స్యకారులు: 5,373	కళాకారులు: 164

వైఎస్సీపీ పాలనలో చేనేత రంగం కుదేలైంది. చేనేత సహకార సంఘాలకు, నేతన్నలకు చెల్లించాల్సిన బకాయిలను ఐదేళ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్నింటినీతుంగలోకి తొక్కి 'నేతన్న నేస్తం'తో చేతులు దులిపేసుకుని చేనేత సహకార సంఘాలకు వైఎస్సీపీ పాలనలో కనీసం ఎన్నికలు కూడా నిర్వహించలేదు. వైఎస్సీపీ నాయకులు, అధికారులతోనే పాలన కొనసాగించారు. ఓ వైపు చేనేత సంక్షేమ పథకాల రద్దు, మరోవైపు చేనేత సంఘాలకు కనీస ఆదాయం లేక కార్మికులకు ఉపాధి కల్పించలేని దుస్థితి. నిర్వీర్యమైన చేనేత రంగానికి జవసత్వాలు నింపి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నేతన్నలు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై కోటి ఆశలతో నేతన్నలు ఎదురు చూస్తున్నారు. కోట్లాది రూపాయల బకాయిలను విడుదల చేయాలని కోరుతున్నారు.



నేతన్నకు కావాలి దన్ను!

- వైఎస్సీపీ రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలి
- అఫీషియల్ కమిటీలను తక్షణం రద్దు చేయాలి
- సొసైటీలకు ఎన్నికలు జరిపించే వరకు.. నాన్ ఆఫీషియల్ కమిటీలను నియమించాలి
- కూటమి ప్రభుత్వం నిర్ణయాల కోసం ఎదురుచూస్తున్న చేనేతలు

(అమలాపురం రూరల్)

రాష్ట్ర విభజన అనంతరం చేనేత సహకార సంఘాలకు ఇంతవరకూ ఎన్నికలు నిర్వహించలేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో వైఎస్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు, అధికారులే పాలకవర్గాలుగా కొనసాగారు. పట్టించుకునే నాథుడు లేకపోవడంతో చేనేత సహకార సంఘాల పరిస్థితి దయనీయంగా మారింది. నేతనేసే కార్మికులకు మాత్రమే 'నేతన్న నేస్తం' అందిస్తూ చేనేతలో కీలక విభాగాల్లో పనిచేసే కార్మికులను పట్టించుకోకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. 'నేతన్న నేస్తం' అందించిన జగన్ ప్రభుత్వం అప్పటివరకు చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, రాయితీలకు మంగళం పాడింది. కార్మికులకు ఉపాధి కల్పించలేని పరిస్థితుల్లో సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎప్పుడు ఏ సంఘం మూతపడుతుందో తెలియని అయోమయ పరిస్థితి జిల్లాలో ఉంది.

వైఎస్సీపీ హయాంలో చేనేత సంఘాల ఎన్నికల ఊసే లేదు..

చేనేత సహకార సంఘాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 12న ఐదేళ్ల కాలపరిమితికి ఎన్నికలు జరిగాయి. పదవీ కాలం 2018 ఫిబ్రవరితో ముగిసింది. విభజిత ఏపీలో అవే పాలకవర్గాలు ఆరు నెలల కాలపరిమితితో పనిచేశాయి. 2019 ఆగస్టు వరకు అవే పాలకవర్గాలు కొనసాగాయి. అనంతరం రాష్ట్రంలో వైఎస్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటివరకు కొనసాగుతున్న పాలకవర్గాలను రద్దుచేసి పర్సన్-ఇన్‌చార్జిలుగా చేనేత సహకార సంఘాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఆరు నెలల కాలపరిమితితో మూడు పర్యాయాలు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగింది. 2021 ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలనను రద్దుచేసి వారి స్థానే ఐదుగురు సభ్యులతో కూడిన నామినేటెడ్ పదవులను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉన్నందున కోర్టు తీర్పుకు లోబడి ఆరు నెలల కాలపరిమితితో ఇప్పటివరకు ఐదు పర్యాయాలు ఫైవ్‌మెన్ కమిటీలను కొనసాగిస్తూ వచ్చారు. మళ్లీ అధికారులకే సహకార సంఘాల నిర్వహణ బాధ్యతను అప్పగించారు. 2018లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడడంతో పాలకులు పట్టించుకోలేదు. 2023లో చేనేత సంఘాలకు రెండోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా జగన్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. ఏడేళ్లుగా పాలకవర్గ ఎన్నికలు లేకుండానే చేనేత సంఘాలు కొనసాగుతున్నాయి. చేనేతకు మాతృ సంస్థ అయిన ఆప్కో సహకార సంఘాల నుంచి కొనుగోళ్లు సక్రమంగా చేయకపోవడంతో వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. లావాదేవీలు స్తంభించిపోవడంతో కార్మికులకు ఉపాధి కల్పించలేని పరిస్థితి ఏర్పడింది.

రాయితీలన్నీ ఎత్తేశారు..

గతంలో టీడీపీ, కాంగ్రెస్ పాలనలో చేనేత సహకార సంఘాలకు, కార్మికులకు ప్రభుత్వ పరంగా ఎన్నో రాయితీలు, సంక్షేమ పథకాలు అమలు జరిగేవి. ఒకే ఒక్క 'నేతన్న నేస్తం'పథకం పేరుతో సంక్షేమ పథకాలకు, రాయితీలకు వైఎస్సీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది. పోనీ దానిని చేనేత కార్మికులందరికీ వర్తింపచేస్తుందా అంటే అదీ లేదు. మగ్గం నేస్తున్న కార్మికులకు మాత్రమే ఆ పథకాన్ని వర్తింపచేస్తూ కీలకమైన సరిజట్లు, జంత్రం విసిరే కార్మికులు, రంగుల అద్దకం వంటి విభిన్న పనుల్లో పనిచేసే కార్మికులను వదిలేశారు.

జిల్లాలో 23 చేనేత సహకార సంఘాలు ఉండగా కె.జగన్నాథపురం, హసన్‌బాద, శివల, రాయవరం, మండపేట కొద్దిపాటి లాభాల్లో ఉన్నాయి. మిగిలిన అన్ని సంఘాలు రూ.50లక్షల నుంచి రూ.కోటికిపైనే నష్టాల్లో ఉన్నాయి. ఆయా సంఘాలు కోలుకునే పరిస్థితులు లేవు. దానికి తోడు కొన్ని సంఘాలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి. గతంలో చేనేత సహకార సంఘాలకు నగదు పరపతిపై పావలా వడ్డీ రాయితీ ఉండేది. ఆ పథకాన్ని జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. దానికి తోడు నగదు పరపతిపై వడ్డీ రేటును మరింత పెంచడంతో చేనేత సంఘాల మనుగడ కష్టసాధ్యమైంది. అవసాన దశలో ఉన్న చేనేత సంఘాలను ఆదుకోవడంతో పాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై పడింది.

రాయితీల బకాయిలు కోట్లలోనే...

జిల్లాలోని చేనేత సహకార సంఘాలకు గత వైఎస్సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయల బకాయిలు చెల్లించకుండా కాలం వెళ్లదీసింది. రాయితీలను చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో 2021 నుంచి చేనేత, జౌళి శాఖ అధికారులు లెక్కలు వేయడం కూడా మానేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేనేత కార్మికులు, సంఘాలకు నూలుపై 20 నుంచి 40 శాతం సబ్సిడీ అందించేవారు. 2021 మార్చి 3 వరకు జిల్లాలోని 16,760 మంది కార్మికులకు రూ.3.54 కోట్లు బకాయిపడ్డారు. చేనేత వస్త్రాల అమ్మకాలపై గత చంద్రబాబు పాలనలో 20 నుంచి 30 శాతం రిబేటు అందించేవారు. 2019-20 నాటికి రూ.2.81 కోట్ల మేర బకాయిలను వైఎస్సీపీ ప్రభుత్వం జిల్లాకు విడుదల చేయలేదు. ఇక త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద కార్మికులకు రూ.81లక్షలు చెల్లించాల్సి ఉంది. పావలా వడ్డీ రాయితీ రూ.3.56 కోట్లు, మార్కెటింగ్ ఇన్సెంటివ్ కింద రూ.3.40 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా 'నేతన్న నేస్తం'తో వీటన్నింటికీ మంగళం పాడేశారు. వైఎస్సీపీ ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడంతో కోట్లాది రూపాయల ఆర్థిక భారం చేనేత సహకార సంఘాలపై పడింది.



మోరి చేనేత సహకార సంఘంలో వస్త్ర నిల్వలను పరిశీలిస్తున్న అధికారి గౌరీశంకర్

బకాయిలు విడుదల చేయాలని మంత్రికి వినతి



చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ టీడీపీ చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతా వీరభద్రేశ్వరరావు, జాన పార్వతీశం, పులవర్తి సొసైటీ మాజీ అధ్యక్షుడు పేరిశెట్టి లాలయ్య తదితరులు చేనేత, జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.సవితను ఇటీవల కలిసి వినతిపత్రం అందజేశారు. చేనేత సహకార సంఘాలు అధికారుల ఏలుబడిలో ఉండడంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని, అధికారులు పరిమిత సంఖ్యలో ఉండడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వివరించారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు నామినేటెడ్ కమిటీలను నియమించి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

డయేరియా ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు

- జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు
- పారిశుధ్య నిర్వహణతో పాటు వాటర్ ట్యాంకుల శుభ్రతకు ఆదేశం



ఆలమూరులో మంచినీటి ట్యాంకు నిర్వహణపై వివరాలు తెలుసుకుంటున్న డీపీవో రాంబాబు

ఆలమూరు, జూన్ 27: డయేరియా ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. జిల్లాలో డయేరియా ప్రభా వం అంతగా లేదని, అయితే ముందు జాగ్రత్త చర్యగా పారిశుధ్య నిర్వహణ, వాటర్ ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గురువారం ఆయన మండలంలోని ఆలమూరు, చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల గ్రామాల్లో ఆరు మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. ప్రతిరోజూ నీటిని క్లోరినేషన్ చేయాలని, 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గత ఏడాది అల్లవరం, ఉప్పలగుప్తం తదితర మండలాల్లో డయేరియా కేసులు అధికంగా నమోదయ్యాయని, దీంతో ఈ ఏడాది వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాది పక్క జిల్లాలో కేసులు ఎక్కువగా నమోదు కావడంతో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వాటర్ ట్యాంకుల క్లీనింగ్, పారిశుధ్యం విషయాల్లో నిర్లక్ష్యం వహించొద్దని కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై డయేరియా లక్షణాలు ఉంటే ముందుగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలమూరు ఎంపీడీవో మేరీరోజ్, ఆలమూరు, చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల పంచాయతీల కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, సీహెచ్‌వీ వెంకటరెడ్డి, వి.వేణు, సీహెచ్ వీర్రాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో

మంత్రి సుభాష్ తనిఖీలు... 7లో

ముంపులో నారుమడులు

రావులపాలెం, జూన్ 27: ఖరీఫ్ నారుమడులు ప్రతి సంవత్సరం ఆలస్యమవుతున్నాయి. రబీ కోతల సమయంలో తుఫానులు, వాయుగుండాల కారణంగా సంభవించే వర్షాలకు పంట నష్టపోవాల్సి వస్తోంది. దీంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు ముందస్తుగానే నారుమడుల ప్రక్రియను ప్రారంభించారు. కాల్వలకు నీరు విడుదల చేసినప్పటికీ ప్రాంతాలవారీగా దఫదఫాలుగా నారుమడులను రైతులు పూర్తి చేసుకుంటున్నారు. గడిచిన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ నారుమడులు ముంపు బారిన పడ్డాయి. నారుమడిలో వేసిన విత్తనాలు పోగులుగా పడడం, ముంపు బారిన పడి కోర కుళ్లిపోవడం జరిగే అవకాశాలున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆదిలోనే హంసపాదు అన్న చందాన నారుమడుల దశలోనే వర్షాల కారణంగా మడులు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క ఖరీఫ్ ధాన్యాన్ని తూచి నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాలోకి సొమ్ములు జమకాలేదు. దీంతో వారికి తెచ్చిన అప్పులు తీర్చకపోగా కొత్త అప్పులు తెచ్చి నారుమడులు కోసే పరిస్థితి ఏర్పడింది. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగితే ముంపు బారిన పడ్డ నారుమడులు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. మరలా విత్తనాలు కొనుగోలుచేసి నారుమడులు పోయాలంటే అప్పుల భారం మరింత పెరుగుతుందని రైతులు వాపోతున్నారు.



ముమ్మిడివరప్పాడులో వర్షపు ముంపులో వరి నారుమడులు

మంత్రిగా పనిచేసినా అభివృద్ధి ఏదీ!

- వాడివేడిగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- చైర్‌పర్సన్ విచక్షణాధికారంపై చర్చ
- అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకంపై రభస
- పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి
- అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం టౌన్, జూన్ 27: మున్సిపల్ అధికారుల పనితీరుతో పాటు చైర్‌పర్సన్ విచక్షణాధికారంపై అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో వాడివేడి చర్చ సాగింది. చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఎక్స్‌అఫీషియో సభ్యునిగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సమావేశానికి తొలిసారి హాజరయ్యారు. సమావేశం దృష్టికి తీసుకురాకుండా టెండర్లు ఎలా రద్దు చేస్తారని సభ్యులు ప్రశ్నించారు. పాత టెండర్లు రద్దు చేయకుండా కొత్తగా టెండర్లు ఎలా పిలుస్తారని టీడీపీ కౌన్సిలర్ బొర్రా చిట్టిబాబు ప్రశ్నించారు. సెక్షన్ 49 ప్రకారం చైర్‌పర్సన్ ముందస్తు అనుమతితోనే టెండర్లు పిలిచామని కమిషనరు ఎస్.మనోహర్ తెలిపారు. చైర్‌పర్సన్ ముందస్తు అనుమతులు ఎటువంటి వాటికి తీసుకోవాలో మీకు తెలుసా అని పలువురు సభ్యులు మండిపడ్డారు. అత్యవసర పనుల కోసమే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. పట్టణంలో 76 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, వారినీ కొనసాగించే అంశంపై విపక్ష కౌన్సిలర్లు ప్రశ్నల వర్షం కురిపించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది వివరాలను సమావేశం దృష్టికి తీసుకురావాలని కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి పట్టుబట్టారు. అదే సమయంలో తీర్మానాన్ని ఆమోదించడంపై విపక్ష టీడీపీ, జనసేన కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనరేటర్‌కు నెలకు రూ.60వేలు అద్దె చెల్లిస్తున్న అంశంపై కౌన్సిలర్లు మండిపడ్డారు. జనరేటర్ కొనే ఆర్థిక స్తోమత పురపాలక సంఘానికి లేదా అని ప్రశ్నించారు. వాటర్ కనెక్షన్‌కు పన్ను వేయాలని అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నా ఎందుకు పట్టించుకోవట్లేదని అధికారపక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర అధికారుల తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. అధికారులెవరైనా నిర్లక్ష్యం ప్రదర్శించినా, తప్పులు చేసినా చట్టబద్ధంగా చర్యలు తీసుకునేందుకు తీర్మానం చేద్దామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రతిపాదించారు. పురపాలక సంఘంలో పాతుకుపోయిన సిబ్బందిని వెంటనే పంపించివేయాలని సభ్యులు డిమాండు చేశారు. కుళాయిల ద్వారా మురుగునీరు వస్తున్నా ఎందుకు పట్టించుకోవట్లేదని, ప్రజారోగ్యం పట్టదా అని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఓఎన్జీసీ నుంచి సీఎస్ఆర్ నిధులను తీసుకువచ్చేందుకు 1990 దశకంలోనే పునాదులు వేసినట్టు ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. ఆనాడు చేసిన ఉద్యమాల ఫలితంగా నేటికీ ఏటా రూ.6 కోట్లు సీఎస్ఆర్ నిధులు కేటాయించే పరిస్థితిని తానే తీసుకువచ్చానని గుర్తు చేశారు. ఓఎన్జీసీ భారీ వాహనాల వల్లే వంతెనలు, రోడ్లు దెబ్బతింటున్నందున వాటి స్థాయికి అనుగుణంగా నిర్మాణాలు జరిపేందుకు ఓఎన్జీసీపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు నిర్ణయించారు.

వైఎస్సీపీ పాలనలో పినిపే విశ్వరూప్ ఐదేళ్లు మంత్రిగా పనిచేసినా పట్టణాభివృద్ధికి చేసింది ఏమీ లేదని విపక్ష కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన అమలాపురం పట్టణాభివృద్ధిలో భాగంగా చేపట్టబోయే కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే ఆనందరావు హయాంలోనే పట్టణం ఎంతో అభివృద్ధి చెందిందని టీడీపీ, జనసేన కౌన్సిలర్లు వివరించారు. ఆనందరావుకు ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సహా కౌన్సిలర్లు, అధికారులు సిబ్బంది దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

వైఎస్సీపీ కౌన్సిలర్‌గా ఎన్నికైన వాసంశెట్టి కృష్ణకుమారి కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, జనసేన కౌన్సిలర్ల పక్కన కూర్చున్నారు. కృష్ణకుమారి తనయుడు వాసంశెట్టి సుభాష్ కూటమి ప్రభుత్వంలో మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టారు. కృష్ణకుమారికి ముందుగానే సీటు కేటాయించడం విశేషం. ఎమ్మెల్యే ఆనందరావు సహా కౌన్సిలర్లు కృష్ణకుమారికి దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. సమావేశంలో కౌన్సిలర్లు యేడిద శ్రీను, సంసాని బులినాని, అబ్బిరెడ్డి చంటి, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, గండి దేవిహారిక, వాసర్ల లక్ష్మి, ఆశెట్టి నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు



ఎమ్మెల్యే ఆనందరావును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు



మంత్రి వాసంశెట్టి సుభాష్ తల్లి, కౌన్సిలర్ వాసంశెట్టి కృష్ణకుమారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



నిలిచిపోయిన పర్యాటక బోట్లు

పెరుగుతున్న గోదావరి

పాపికొండల విహారయాత్ర బోట్లు నిలుపుదల

దేవీపట్నం, జూన్27: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో గోదావరి నెమ్మదిగా పెరుగుతోంది. దీనికి తోడు తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి నీటి మట్టం మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తుంది. గోదావరి పెరుగుదల, తుఫాన్ కారణంగా పాపికొండలు విహార యాత్ర తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. అయితే మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నేటి నుంచి నాదెండ్ల మనోహర్ పర్యటన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 27: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్ర, శనివారాలలో కాకినాడలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, పౌరసరఫరా సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ ద్వారా రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, కార్డుదారులతో సమావేశమవుతారు. జిల్లాలో రబీ సీజన్‌లో చేపట్టిన ధాన్యం సేకరణ, కనీస మద్దతు ధర చెల్లింపు తదితర అంశాలపై ఆయా శాఖల సంబంధిత అధికారులు, రైతులతో మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం నిర్వహిస్తారు. గురువారం రాత్రి మంత్రి నాదెండ్ల కాకినాడ చేరుకున్నారు.

జాతీయ రహదారుల పనుల పురోగతిపై సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ) జూన్ 27: జిల్లాలో జాతీయ రహదారుల పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి తదితరులు రెవెన్యూ, రోడ్లు, భవనాలు, ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కాకినాడ నుంచి రాజమండ్రి వరకు నిర్మించే రహదారి, వాకలపూడి నుంచి అన్నవరం, కత్తిపూడి నుంచి అమలాపురం వరకు నిర్మిస్తున్న రహదారుల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. రహదారుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భూసేకరణ సమస్యలు అధిగమించే విధంగా ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ సర్వే సమన్వయంతో పనిచేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిశోర్, సీతారామారావు, రోడ్లు, భవనాల, ఎన్‌హెచ్ఏఐ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రూ. 1.25 కోట్ల విలువైన

మద్యం ధ్వంసం





మద్యం సీసాల ధ్వంసం

సర్పవరం జంక్షన్, జూన్ 27: కాకినాడ జిల్లాలో రెండేళ్ల కాలవ్యవధిలో ఎస్ఈబీ, పోలీసులు నిర్వహించిన దాడులు, తనిఖీల్లో పట్టుబడిన సుమారు రూ. 1.25 కోట్ల విలువైన 32 వేల లీటర్ల మద్యం బాటిల్స్‌ను గురువారం ధ్వంసం చేశారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో గురువారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్పీ,సెబ్ శ్రీలక్ష్మి పర్యవేక్షణలో పోలీసులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం, అక్రమ నాటుసారా రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు చెప్పారు. ఎస్ఈబీ, పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాడులు, తనిఖీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. రెండేళ్ల కాలవ్యవధిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా రవాణా అవుతున్న 94,737 మద్యం బాటిల్స్, 12,532.45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు సెబ్, పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో 32 వేల లీటర్ల మద్యం బాటిల్స్, నాటు సారాను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ జె.రామ్‌కుమార్, కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, పలువురు సెబ్, లా అండ్ ఆర్డర్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో పలువురికి పది లోపు ర్యాంకులు

ఏపీపీజీసెట్ -2024
ఫలితాలు విడుదల
సత్తాచాటిన విద్యార్థులు

కాకినాడ రూరల్, జూన్ 27: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీజీ కళాశాలల్లోని సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఏపీపీజీసెట్-2024 ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో పదిలోపు ర్యాంకులు సాధించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటకు చెందిన బాలచంద్ర పటి బీఎఫ్ఏలో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకును సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన కేదరి శ్రీసాయివినయ్ 2వ ర్యాంకు, సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన కుమ్మరి నితిన్‌సాగర్ 8వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అంతర్వేది మాధురి 10వ ర్యాంకు పొందారు. ఎంఏ ఎడ్యుకేషన్‌లో కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన దడాల అయ్యా రాజశేఖర్ 9వ ర్యాంకును, ఎఫ్ఎన్ఎస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన అద్దేపల్లి వసంతి 7వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కమ్మవారివీధికి చెందిన సత్తి బ్రహ్మవర్షిని 12వ ర్యాంకును, కె.గంగవరానికి చెందిన నాగులాపల్లి హేమలత 12వ ర్యాంకు సాధించారు. జనరల్ సబ్జెక్టులో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన కోనమహాలక్ష్మి 6వ ర్యాంకు, హిందీలో కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలేనికి చెందిన పాలిక పూజిత 1వ ర్యాంకు, అదే ప్రాంతానికి చెందిన పాలిక సాయిసుష్మిత 6వ ర్యాంకు, హిస్టరీలో కాకినాడ రంగయ్యనాయుడు వీధికి చెందిన అడపా శ్రీసత్య 6వ ర్యాంకును, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన టీవైఎస్ ఈశ్వరరావు 6వ ర్యాంకును పొందారు. కెమికల్ సైన్సెస్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన బిక్కిన సత్యప్రియ రెండో ర్యాంకు సాధించింది. ఇంగ్లీష్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కుప్పల శ్రావ్య 11వ ర్యాంకు సాధించింది. లైఫ్ సైన్సెస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాసుల తేజో వెంకటవీణ సుష్మ 1వ ర్యాంకు సాధించింది. మేథమెటికల్ సైన్సెస్‌లో కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన మోరుకుర్తి లక్ష్మీ తేజస్విని 2వ ర్యాంకు, పెదపూడికి చెందిన కారెడ్ల శిరీష 4వ ర్యాంకు, కాకినాడ రూరల్‌కు చెందిన చోడిశెట్టి శ్రీలక్ష్మి 6వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన గుండుబోగుల హరివీర శివసత్యనారాయణ 12వ ర్యాంకు సాధించారు. ఫిజికల్ సైన్సెస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన నువ్వుల ఈశ్వర్ హరి సాయికుమార్ 12వ ర్యాంకు సాధించాడు. పొలిటికల్ సైన్స్‌లో కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన నట్టే వీరవెంకట వేణు మహేశ్వరి 3వ ర్యాంకు, సంస్కృతంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన ములకల వెంకటలక్ష్మి 9వ ర్యాంకు, స్టేటస్టిక్స్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తానికి చెందిన కేశనకుర్తి వీరవెంకట సత్యవాణి 2వ ర్యాంకు, అమలాపురానికి చెందిన రాయుడు భార్గవి సాయి ప్రజ్ఞ 7వ ర్యాంకు, తెలుగులో కాకినాడ జిల్లా కాజులూరుకు చెందిన మేడిశెట్టి శిరీషాదేవి 2వ ర్యాంకు, ఇదే ప్రాంతానికి చెందిన కొండమూరి కాశీ కృష్ణవేణి 5వ ర్యాంకు, టూరిజంలో కాకినాడకు చెందిన యతిరాజ్యు అభినయ సాయి 10వ ర్యాంకు, జువాలజీలో కాకినాడకు చెందిన కుప్పిలి భావన 9వ ర్యాంకు సాధించారు.

ఏపీఎడ్‌సెట్‌లో ప్రతిభ

ఏపీఎడ్‌సెట్ ఫలితాల్లో గణితశాస్త్రంలో కాకినాడ జిల్లా కాకినాడకు చెందిన కాకరపర్తి భావనాఫణిప్రియ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది.

శనేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



కొత్తపేట, జూన్27: మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామి ఆలయంలోని హుండీలు గురువారం తెరిచి కానుకలను లెక్కించారు. శనేశ్వరస్వామికి హుండీల ద్వారా రూ.2.94లక్షలు, ఆలయ ప్రాంగణంలో గల వేణుగోపాల స్వామికి హుండీలద్వారా రూ.13,072, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.8,784 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. ప్రత్యేకాధికారి వీవీవీఎస్ కామేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చింతా విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి వీర వెంకటసత్యనారాయణ, వీఆర్వో ఉత్తరకుమారి, సాదు చెంచయ్య ఆర్యవైశ్య సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లి ఆదాయం రూ.1.71 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,71,407 లభించినట్టు ఈవో, ఉప కమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అన్నదాన ట్రస్టుకు పలువురు దాతలు విరాళాలు అందజేశారు.



సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

పేదలకు మెరుగైన సేవలందించాలి

రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో మంత్రి సుభాష్ తనిఖీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 27: ప్రభుత్వాసుపత్రులకు పేదలు వస్తారని వారికి మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిని మంత్రి సుభాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలు దాటితే వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, దీంతో ప్రాథమిక చికిత్స జరగడం లేదని కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి వైద్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రక్త తదితర పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లకు సిఫార్సు చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. మంత్రి రికార్డులు పరిశీలిస్తుండగా ప్రైవేటు ల్యాబ్‌ల లెటర్‌ప్యాడ్స్ కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమిటిది ఏం జరుగుతుందని మండిపడ్డారు. వెంటనే సెకండరీ హెల్త్ డైరెక్టరుకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో సామాన్యులను ఇబ్బంది పెట్టొద్దు, అన్ని రకాల పరీక్షలు ఆసుపత్రిలో నిర్వహించాలని ఆదేశించారు. సామాన్య రోగులను ఇబ్బంది పెడితే సహించబోనన్నారు. జనరిక్ మందులు షాపులో బయట మందులు పెట్టి అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఫిర్యాదుపై మందుల షాపును పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో బయట మందులు వైద్యులు సిఫార్సు చేయవద్దని, అన్ని రకాల మందులు జనరిక్ షాపులో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అవుట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాని వారిని తొలగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో పలువార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మంత్రి సుభాష్ మాట్లాడారు. బ్లడ్ బ్యాంకు, ల్యాబ్ ఇతర వార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియామక ప్రక్రియ చేపట్టగానే పోస్టుల భర్తీ చేస్తామని తెలిపారు. జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, రవ్వా భూషణం, శివ, టేకుమూడి సత్యనారాయణ, మేడిశెట్టి శేషారావు జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1753 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానం

ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి రూ.13.93 కోట్ల లాభాలు
కాకినాడ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర

కాకినాడ సిటీ, జూన్ 27: రాష్ట్రంలో 46 సహకార కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులుండగా, కాకినాడ కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ రూ.1753 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానంలో ఉందని, ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ 13.93 కోట్ల లాభాలను ఆర్జించిందని బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు 45వ వార్షిక ఆడిట్ నివేదిక వివరాలను వెల్లడించారు. వినియోగదారుల సౌకర్యార్థం రానున్న కాలంలో నర్సీపట్నం, నూజివీడు, విజయనగరం, శ్రీకాకుళం, భీమవరం, పిఠాపురంలో నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ.1,056.73 కోట్లు డిపాజిట్లు, రూ 696.47 కోట్ల రుణాలు, రూ.447.35 కోట్లు ఇన్‌వెస్ట్‌మెంట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే బ్యాంకు రూ.172.13 కోట్ల సొంత నిధులు కలిగి ఉందన్నారు. బ్యాంకుకు 53 వేల 360 మంది సభ్యులు రూ.30.37 కోట్ల వాటా ధనం కలిగి ఉన్నారని, ఈ ఏడాది ఒక్కో సభ్యునికి 15 శాతం డివిడెండ్ ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదించిందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.1,000 కోట్లు దాటడంతో రిజర్వ్ బ్యాంకు వారు టౌన్ బ్యాంక్ టైర్-త్రీ బ్యాంక్‌గా గుర్తించిందన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం బ్యాంక్ తర్వాత కాకినాడ టౌన్ బ్యాంక్ మాత్రమే టైర్-త్రీ బ్యాంక్‌గా ఉందన్నారు. అదే విధంగా ప్రతి ఖాతాదారుడు పాన్ కార్డు, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని, దీని నిమిత్తం బ్యాంకు ఎటువంటి రుసుం వసూలు చేయదన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్‌చైర్మన్ తోట సుధీర్, డైరెక్టర్లు కంటిపూడి సత్యనారాయణ, రిమ్మలపూడి ధర్మేంద్ర, సీఈవో సి.సుగుణరావు, సహ సీఈవో బీఎస్‌వీ సుహాస్ పాల్గొన్నారు.

మరో ఇద్దరికి డయేరియా



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

రంగంపేట, జూన్ 27: రంగంపేట మండలం ఈలకొలను గ్రామం శివారు అచ్యుతాపురంలో డయేరియా ప్రబలడంతో గురువారం మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారికి వైద్య సేవలందించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి పంపించినట్టు రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి అత్యవసర వైద్య విభాగ బృందం వైద్యులు రాజీవ్, సుధీర్, మెడికల్ కళాశాల వైద్యాధికారులు, టెక్నికల్ సిబ్బంది గ్రామంలో పర్యటించి వాటర్ ట్యాంక్‌లను, పైపులైన్‌లను, డ్రైనేజీ, శానిటేషన్ పనులను పరిశీలించారు. వాటర్, బాధితుల మలం శాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, డీఎల్‌పీవో ఎం.నాగలత, ఈవోపీఆర్డీ టి.వెంకటరత్నం గ్రామంలో పర్యటించి శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మి, చిన్నారావు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. పారామెడికల్ సిబ్బంది నాలుగు టీమ్‌లుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మాంసాహారాలు తినవద్దని, వండిన ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని సూచించారు. బుధవారం డయేరియాతో అస్వస్థతకు గురైన ఆరుగురు పూర్తిగా కోలుకున్నారని, గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉందని డాక్టర్ వేణుశ్రీలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్ఈవో ప్రసాద్, ఎంపీహెచ్ఎస్ పి.రాజేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సీనియర్ విద్యార్థుల దాడితో మనస్తాపం

బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న శివగంగాధర్

ప్రత్తిపాడు, జూన్ 27: సీనియర్ విద్యార్థులు దాడి చేయడంతో అవమాన భారంతో ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ప్రత్తిపాడులోని ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒమ్మంగి గ్రామానికి చెందిన కంచి శివగంగాధర్ గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు బస్సులో వెళుతుండగా అదే కళాశాలలో చదువుతున్న కొంత మంది సీనియర్ విద్యార్థులు పోలీసులమని చెప్పి బస్సు దింపి కారులో ఎక్కించుకుని చేబ్రోలు తీసుకెళ్లి దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. ఎందుకు కొట్టారో తెలియక అవమాన భారంతో ఒమ్మంగి వచ్చి బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న శివను ప్రత్తిపాడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. దీంతో బాధితుడు మేనమామ పెనుమాకుల శివ గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి, జూన్27: జాతీయ రహదారిపై జెడ్.రాగంపేట డివైడర్ వద్ద గురువారం లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానిక పోలీసులు సమాచారం ప్రకారం మల్లేపల్లి గ్రామానికి చెందిన చంద్రపాటి లోవరాజు(44) పనికి వెళ్లి జగ్గంపేట వైపు నుంచి మల్లేపల్లి వస్తుండగా జెడ్.రాగంపేట వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి లోవరాజుపైకి ఎక్కడంతో ఆయన శరీరం లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జైంది. అతని సొంతూరు లింగంపర్తి కాగా మల్లేపల్లిలో అత్తారింట్లో కాపురం ఉంటున్నాడు. లోవరాజుకు భార్య, కొడుకు ఉన్నారు. ఏఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మాలకొండయ్య

అంబాజీపేట, జూన్ 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న పి.మాలకొండయ్యకు మెరిటోరియస్ ఎంప్లాయీస్ అవార్డును ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అందించారు. తాడేపల్లిగూడెం సమీపంలోని వెంకటరామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును, రూ.2,500 నగదు, ప్రశంసాపత్రాన్ని కొండయ్యకు అందించారు. కొండయ్యను స్థానిక పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష, ఎ.కిరిటీ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



ఆలమూరు, జూన్ 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన కొక్కిరిమెట్ల గాంధారమ్మ (112) గురువారం మృతి చెందారు. ఈమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా ముగ్గురు కుమార్తెలు జీవించి ఉన్నారు. మనుమలు, మనుమరాండ్లు, మునిమనుమలు, మునిమనుమరాళ్లు కలిపి 120 మంది ఉన్నారు. గాంధారమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

గాయపడిన కొండచిలువకు ఆపరేషన్..మృతి



ఆపరేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు, జూన్27: గుర్తుతెలియని వాహనం పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ కొండచిలువను బతికించేందుకు పశు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ కొండచిలువ మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో రోడ్డు మార్గం దాటుతున్న కొండచిలువపై గుర్తుతెలియని వాహనం దూసుకువెళ్లింది. దీంతో కొండచిలువ తీవ్రంగా గాయపడింది. ఏలేశ్వరం అటవీ శాఖ సిబ్బంది బుధవారం ప్రత్తిపాడు పశువుల ఆసుపత్రికి ఆ కొండ చిలువను తీసుకొచ్చారు. స్థానిక పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ బాలచంద్రయోగేశ్వర్, పశువైద్యాధికారి సతీష్‌కుమార్ బృందం ఈ కొండ చిలువకు ఆపరేషన్ చేసి కుట్లు వేశారు. ఆపరేషన్ అనంతరం దాని సంరక్షణ కోసం రాజమహేంద్ర వరంలో అటవీ శాఖ పునరావాస కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ ఈ కొండ చిలువ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో ఆ కొండ చిలువకు ఏలేశ్వరం ఫారెస్ట్ శాఖకు చెందిన ఎఫ్ఆర్ఓ దుర్గారాంప్రసాద్, సిబ్బంది ఏలేశ్వరం తరలించగా గురువారం సాయంత్రం ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బాలచంద్రయోగేశ్వర్, పశువైద్యాధికారి సతీష్‌కుమార్ బృందం పోస్టుమార్టం నిర్వహించింది. అనంతరం మృతి చెందిన కొండ చిలువను నిర్మానుష్య ప్రదేశంలో ఫారెస్ట్ సిబ్బంది పూడ్చివేశారు. కొండ చిలువ ప్రాణాలు కాపాడటానికి అటవీ శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు శ్రమించినప్పటికీ ఫలితం దక్కలేదు.

రామోజీరావు విగ్రహం అందజేత

విగ్రహాన్ని రూపొందించిన మాధవరావు



విగ్రహాన్ని నారా లోకేశ్‌కు అందిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జూన్ 27: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు విగ్రహాన్ని తయారుచేసిన ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన శిల్పి పెద్దిరెడ్డి మాధవరావు గురువారం రామోజీరావు కుటుంబ సభ్యులకు విగ్రహాన్ని అందజేశారు. విజయవాడలోని కానూరులో గురువారం జరిగిన రామోజీరావు సంతాప సభలో తాను రూపొందించిన రామోజీరావు విగ్రహాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రామోజీరావు కుటుంబ సభ్యులకు పెద్దిరెడ్డి మాధవరావు, అతని కుమారుడు రవీంద్ర అందజేశారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు పూర్తి

దివాన్‌చెరువు, జూన్ 27: ఏపీ ఆర్‌సెట్‌లో అర్హత సాధించిన జియాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని స్థానిక ప్రాంగణంలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు గురువారం పూర్తయినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. మేనేజ్‌మెంట్ విభాగంలో 321 మంది విద్యార్థులకు గాను 261 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. అలాగే జియాలజీ స్కాలర్‌లు ఈ నెల 24న నిర్వహించిన ఇంటర్వ్యూలకు 34 మంది విద్యార్థులకు గాను 25 మంది హాజరయ్యారన్నారు. సెట్ కన్వీనర్ సూచనల మేరకు ఎంతో పారదర్శకంగా జియాలజీ, మేనేజ్‌మెంట్ ఆచార్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు.

30న జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అమలాపురంటౌన్, జూన్27: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల30న సూర్యాపేటలో 136వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం-కవితోత్సవం నిర్వహిస్తున్నట్టు అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ తెలిపారు. కవి సమ్మేళనం బ్రోచర్లను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. శ్రీశ్రీకళా వేదికజిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ, జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, ఎ.ప్రభుదాస్, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల టీఏ, డీఏలు అందించాలి

పి.గన్నవరం, జూన్ 27: మే నెలలో జరిగిన సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న వీఆర్వోలు, గ్రామ సహాయకులకు వెంటనే టీఏ, డీఏ అందించాలని నియోజకవర్గ పరిధిలోని వీఆర్వోలు డిమాండ్ చేశారు. తహశీల్దార్ ఎస్కే హరాస్సేన్‌కు గురువారం వినతిపత్రం అందించారు. అలాగే మూడేళ్లుగా బీఎల్వోలుగా విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు, వీఆర్ఏలకు గౌరవ వేతనం ఇప్పటి వరకు చెల్లించలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో వీఆర్వోల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ఈవీవీ సత్యనారాయణ, ఎస్.నాగరాజు, కె.నారాయణ, ఎల్.బాలజీ, చింతపర్తి వెంకటేశ్వరావు, రమేష్, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీ, ఎస్టీలకే ఖర్చు చేయాలి

ఐ.పోలవరం, జూన్ 27: సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీ, ఎస్టీలకే వినియోగించాలని మాలమహానాడు జిల్లా కార్యదర్శి రేవు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సీతన్నచెరువులో గురువారం మాలమహానాడు సమావేశం జరిగింది. చంద్రబాబు ఎస్సీ వర్గీకరణపై చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే వర్గీకరణపై మాట్లాడటం సరికాదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం, జూన్ 27: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ తీగల మరమ్మతులు వంటి పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బైర్రాజు సత్యనారాయణరాజు వర్ధంతి

ముమ్మిడివరం, జూన్27: బైర్రాజు సత్యనారాయణరాజు ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలు మరువలేనివని టీడీపీ జిల్లా కార్యదర్శి పొత్తూరి విజయభాస్కరవర్మ పేర్కొన్నారు. చినకొత్తలంకలోని బైర్రాజు ఫౌండేషన్ భవనంలో గురువారం నిర్వహించిన సత్యనారాయణరాజు వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. పి.సీతారామరాజు, పి.మల్లికార్జున వర్మ, ఎం.పద్మనాభరాజు, పి.నాగరాజు, కె.నరేంద్రరాజు, కె.సుబ్రహ్మణ్యం, పి.చైతన్యవర్మ, పి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

మలికిపురం, జూన్ 27: మోరి జిల్లా పరిషత్ హైస్కూలులో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. మోరిలో జిల్లా పరిషత్ హైస్కూలులో భవనాలు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సఖినేటిపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, మాజీ ఎంపీపీ పప్పుల లక్ష్మీసరస్వతిరమేష్, జనసేన నాయకులు నిమ్మగడ్డ బాబు, బళ్ల రాము ఉన్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోంది రా..

అంతర్వేది, జూన్ 27: అంగన్‌వాడీ పిలుస్తోంది రా.. కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో గ్రాడ్యుయేషన్ డే వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సీడీపీవో వైకేడీ రమాదేవి తెలిపారు. మోరిలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీలో ప్రీ స్కూలు విద్యను పూర్తిచేసిన పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మోరి సర్పంచ్ లక్ష్మీపద్మమంగతాయారు, ఎంపీటీసీ జాన సూర్యావతి, సూపర్‌వైజర్లు కె.చంద్రకళ, ప్రసన్నరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎ.పద్మావతి, కె.రత్నకుమారి, కె.శేషవేణి, కె.జ్యోతి, సునీత, నందిని, ఎస్తేరు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పెన్షన్

ఉప్పలగుప్తం, జూన్ 27: జూలై ఒకటో తేదీన లబ్ధిదారులకు ఇళ్ల వద్దే పెన్షన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. మండలంలో వివిధ కేటగిరీలకు చెందిన మొత్తం 8,004 మందికి రూ.5,36,18,000 ఒకే రోజు పంపిణీ చేస్తామన్నారు.

సేవకు నిర్వచనం అక్రమ్ అలీ: ఎమ్మెల్యే

మామిడికుదురు, జూన్ 27: సేవకు నిర్వచనం తన స్నేహితుడు అక్రమ్ అలీ(అబ్బు) అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. తనకు చేదోడు వాదోడుగా ఉండే అబ్బు మరణించడంతో ఆయన సమాధి వద్ద ఎమ్మెల్యే బుధవారం నివాళులర్పించారు. అబ్బు ఆత్మకు శాంతి కలగాలని అల్లాను ప్రార్థించారు. మొహర్రం వస్తుందంటే శానిటేషన్ నిర్వహించి పీర్లకు ఏవిధమైన అడ్డంకులు లేకుండా అబ్బు చేసేవారని ఆయన్ను జ్ఞాపకం చేసుకున్నారు. కార్యక్రమంలో మహ్మద్ ఖాసింరజా, నూరేన్ అబ్బాస్, ముఖర్రం హుస్సేన్, జాఫర్ అబ్బాస్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్: డీఈవో


నేను బడికి పోతా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

అంబాజీపేట, జూన్ 27: ప్రతి విద్యార్థి చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నేను బడికి పోతా విద్యా ప్రవేశ కార్యక్రమాన్ని ఎంఈవో కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తున్నారనారు. ఈనెల6 నుంచి జూలై 12వరకు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ఎంపీడీవో చైర్మన్‌గా ఆయా గ్రామాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశావర్కర్, సోషల్ వెల్ఫేర్ కమిటీ, పేరంట్స్ కమిటీ, ఐసీడీసీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగి, స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు టీమ్‌గా ఏర్పడి బడి బయట తిరుగుతున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రుల సహకారంతో బడిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీసీ మధుసూదనరావు, డీవైఈవో కె.సూర్య ప్రకాశరావు, ఏపీవో ఎంఎకే భీమరావు, ఎంపీడీవో జీవీ సరోవర్, తహసీల్దారు జె.విమలకుమారి, ఎంఈవో-2 ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్, పీవీ కేశవాచార్యులు, పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్, లక్ష్మిపతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేను బడికి పోతా ర్యాలీ

ఆత్రేయపురం, జూన్ 27: మెర్లపాలెం శివారు వాసంశెట్టివారిపాలెంలో గురువారం ఎంఈవో వరప్రసాదరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా తిరిగి బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని ప్రచారం చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాడిపూడి పాఠశాలలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు.

టిడ్కో పనులను పరిశీలించిన కమిషనర్

మండపేట, జూన్ 27: స్థానిక గొల్లపుంతలో ఉన్న టిడ్కో గృహాల సముదాయంలో జరుగుతున్న పనులను కమిషనర్ బి.రాము గురువారం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదేశాలతో శానిటరీ సిబ్బంది గృహాల చుట్టూ పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను కొద్ది రోజులుగా తొలగిస్తున్నారు. ఆ పనులను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 27: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవల్సిన చర్యలపై అధికారులతో నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తొలిసమావేశం కావడంతో ఎంపీడీవో ఆధ్వర్యంలో కార్యదర్శులు ఎమ్మెల్యేను సన్మానించారు. తహశీల్దార్ ఎస్కే హరాస్సేన్, ఎంపీడీవో సీహెచ్‌త్రిశూలపాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం, జేఈ జె.కల్యాణ చక్రవర్తి, వైస్‌ఎంపీపీ చెల్లిబోయిన గంగాదేవి, ఎంపీటీసీల సమాఖ్య మండల అధ్యక్షుడు ఆదిమూలం సూరయ్యకాపు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, జూన్ 27: ప్రతీ రోజు ప్రతీ ఇంటికీ తాగునీరు అందిస్తేనే లక్ష్యం నెరవేరుతుందని ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అన్నారు. ఎల్ఎస్ ల్యాండ్ మార్కులో ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్‌శాఖ అధికారులతో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ రహితంగా ప్రజలందరికీ మంచి జరిగేలా పనిచేద్దామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీటి పంపిణీ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని తాగునీటి పథకాలను సక్రమంగా పనిచేయడానికి రూ.10కోట్లు అంచనాలను అధికారులు తన దృష్టికి తెచ్చారని, ప్రభుత్వంతో సంప్రదించి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ఏయే గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడుతూ ప్రతీ గృహస్తునికి నాణ్యమైన విద్యుత్ అందాలన్నారు. గుడిమెళ్లంకలో మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ముందుకు వెళ్లడానికి ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. నియోజకవర్గంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పనితీరు, వాటి అవసరాలపై చర్చించారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ ఏవీఎస్ రాజన్, విద్యుత్‌శాఖ ఏడీఈ కె.శ్రీనివాసరావు నియోజకవర్గంలోని ప్రాజెక్టులు, సబ్‌స్టేషన్ల పరిస్థితి గురించి వివరించారు. ఏఈలు ఎం.సతీష్, బి.శ్రీనివాస్, కె.లక్ష్మీశిరీష, బి.సత్యనారాయణ, శ్రీనివాస్, జనసేన, టీడీపీ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

శ్రీరుద్ర శతచండీ మహా సౌరయాగం


మహాసౌరయాగ పూజా దృశ్యం, అభిషేకం (కింద)



ఐ.పోలవరం, జూన్ 27: కేశనకుర్రుపాలెంలో ఉన్న రాజరాజేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల23 నుంచి శ్రీరుద్రశతచండీమహాసౌరయాగం జరుగుతోంది. జూలై నాల్గవ తేదీ వరకు ఈయాగం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. శైవాగమ పండితులు బాదంపూడి సత్యనారాయణాచార్యులు, యలమంచిలి కృష్ణమూర్తిశివాచార్య, కాళ్ళకూరి దుర్గాప్రసాద్‌శర్మ, కాళ్ళకూరి కామేశ్వరశర్మ, వెలవలపల్లి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఐదురోజులుగా హోమాలు, మహాన్యాసం, రుద్రాభిషేకం, శతసహస్ర బిల్వార్చన, సూర్యనమస్కారాలు తదితర పూజాకార్యక్రమాలు 12మంది రుత్విక్కుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. వేగిరాజు వెంకటసత్యనారాయణరాజు, వేగిరాజు గణపతిరాజు, పీవీవీఎస్ వర్మ, ఆకెళ్ళ సూర్యనారాయణఅవధాని, కాళ్ళకూరి కామేశ్వరశర్మ, గాదిరాజు విశ్వనాధరాజు, ఇందుకూరి వెంకటేశ్వరరాజు, యావన్మంద లచ్చిరాజు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

సోమాలమ్మ అమ్మవారి జాతర, తీర్థం



ఆలమూరు, జూన్ 27: జొన్నాడ గ్రామ దేవత సోమాలమ్మ అమ్మవారి జాతర బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. గరగనృత్యాలు, చర్మకార వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువారం తీర్థం సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పలువురు నాయకులు దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

యనమదల రోడ్డు దుస్థితిపై చర్యలు తీసుకోండి


యువకుడు తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూన్ 27: యనమదల - నరసాపురపుపేట రోడ్డు దుస్థితిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సుభాష్ ఆర్డీవో ఎస్.సుధాసాగర్‌ను ఆదేశించారు. గురువారం మంత్రి నివాసంలో యనమదల గ్రామానికి చెందిన విద్యార్థినులు, గ్రామస్థులు మంత్రి సుభాష్‌ను కలిశారు. గ్రామంలో మట్టి మాఫియాతో రోడ్లు ధ్వంస మయ్యాయని తెలిపారు. నరసాపురపుపేట పాఠశాలకు వెళ్లలేకపోతున్నట్లు వివరించారు. ఆర్డీవోకు మంత్రి ఫోన్‌చేసి మట్టి నిల్వలు, రోడ్డు దుస్థితిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బాధిత కుటుంబానికి రూ.50వేలు సాయం

రామచంద్రపురంలోని వైఎస్ఆర్ నగర్‌కాలనీకి చెందిన యువకుడు అయినవిల్లి ప్రసాద్ అకాల మరణం చెందగా ఆ కుటుంబానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం రూ.50వేలు అందజేశారు. అనంతరం ఆ కుటుంబాన్ని మంత్రి ఓదార్చారు. జనసేన నాయకుడు బుంగరాజు, టీడీపీ నాయకులు కంచుమర్తి బాబూరావు, అంకం బుజ్జి పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు వినతుల వెల్లువ

మంత్రి సుభాష్‌ను గురువారం పలువురు ఉద్యోగుల సంఘ నాయకులు కలసి సమస్యలు పరిష్కారం కోసం వినతిపత్రాలు అందజేశారు. పంచాయతీల్లో పనిచేస్తోన్న కంప్యూటర్ ఆపరేటర్లు మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సమస్యలు పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందించారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు మంత్రిని కలిశారు. సమ్మెకాలం జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ, బకాయి వేతనాలపై జేఏసీ చైర్మన్ సీహెచ్.వెంకన్న బాబు వివరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఆటో కార్మికుడు కొండేటి నరేష్ మృతి చెందగా లక్ష్మీ గణపతి గూడ్స్ ఆటో యూనియన్ తరపున రూ.30వేలు, మంత్రి సుభాష్ రూ.10వేలు వెరశి రూ.40వేలు నరేష్ భార్య సూర్యభవానీకి మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొజ్జా తారకం జయంతి


తారకానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం, జూన్ 27: పీడిత ప్రజల హక్కుల కోసం ఎంతో పోరాటం సాగించిన మహోన్నత వ్యక్తి బొజ్జా తారకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో బొజ్జా తారకం జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కన్వెన్షన్ హాలులో రిపబ్లిక్ పార్టీ నాయకుడు పెనుమాల సుధీర్ అధ్యక్షతన జరిగిన బొజ్జా తారకం జయంతి కార్యక్రమానికి అయితాబత్తుల రామేశ్వరరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. హైదరాబాద్ బొజ్జా తారకం ట్రస్టు ప్రచురించిన బుద్ధుని ప్రవచనం పుస్తక ప్రతులను నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. తొలుత పోలమ్మ చెరువుగట్టు బుద్ధా పార్కు ఆవరణలోని బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధిస్ట్ బంతేజీ బుద్ధ వందనం చేయగా అంబేడ్కర్, తారకం విగ్రహాలకు రామేశ్వరరావుగౌతమ్, చిరంజీవి మాస్టర్ పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెయ్యల పరశురాముడు, రవితేజ పృథ్విరాజ్, సూర్యప్రకాష్, కాశి వెంకటరమణ, కేఎస్ఎన్ మూర్తి, పల్లి దేవానందం, వజ్రపు అనితశేషరత్నం, వై.సురేష్, రాజేష్, బొక్కా శ్రీను, జి.దుర్గాప్రసాద్, శంకర్ పాల్గొన్నారు.

రాజోలు: రాజోలులో దళిత చైతన్య వేదిక కార్యాలయంలో ప్రముఖ న్యాయవాది, దళిత హక్కుల పర్యవేక్షణా పోరాట యోధుడు బొజ్జా తారకం జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. తారకం చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా తారకం సంఘటనా స్థలాలకు వెళ్లి న్యాయ పోరాటాలు చేసేవారన్నారు. కార్యక్రమంలో బత్తుల జనార్ధనరావు, చిలకపాటి శ్రీధర్, జిల్లెల్ల వినోద్, చుట్టుగుళ్ల సత్యనారాయణ, మట్టా సురేష్, దీపాటి శివప్రసాద్, కాకర విశ్వనాథం పాల్గొన్నారు.

సముద్ర తీరంలో అలల ఉధృతి

అల్లవరం, జూన్ 27: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల సముద్ర తీరం అలల ఉధృతితో అల్లకల్లోలంగా మారింది. భారీ గాలులతో రాకాసి అలలు విరుచుకుపడుతున్నాయి. ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం తీర ప్రాంతంలో అలల తాకిడికి భూమి కోతకు గురవుతోంది. ఎప్పుడూ పర్యాటకులతో సందడిగా ఉండే తీరం వర్షాల కారణంగా బోసిపోయింది.


ఓడలరేవు తీరంలో ఉవ్వెత్తున ఎగసి పడుతున్న సముద్రపు అలలు

మంత్రిని కలిసిన పంచాయతీ కార్యదర్శులు



అమలాపురం టౌన్, జూన్ 27: కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను గురువారం అమలాపురం డీఎల్పీవో పి.బొజ్జిరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులసంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, సంఘ ప్రతినిధులు శెట్టిమల్లి రాజమోహన్, సింగంపల్లి శ్రీను, పరంశెట్టి ఆదినారాయణ, పరంశెట్టి శ్రీనివాస్, అడబాల ఎస్వీఎస్ రాజేశ్వరరావు (రాజా), దారా రామకృష్ణ పాల్గొన్నారు.

వర్షంతో మునుగుతున్న జాతీయ రహదారి

మామిడికుదురు, జూన్ 27: వర్షం వస్తే జాతీయ రహదారిపై పలుచోట్ల వర్షపు నీరుచేరి అధ్వానంగా తయారవుతుంది. వర్షం వస్తే నగరంలో జాతీయ రహదారిపై అడుగు మేర వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరు రోడ్డు మీదే నిలిచిపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. పాశర్లపూడిలోని కైకాలపేట వద్ద జాతీయ రహదారి పడ్డ పెద్దపెద్ద గోతుల్లో వర్షం నీరు చేరడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈగోతుల్లో ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. వర్షం వస్తే ఈరోడ్డుపై ప్రయాణం నరక ప్రాయంగా ఉందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


నగరం వద్ద జాతీయ రహదారిపై వర్షం

సివిల్ సప్లయిస్ గోదామును పరిశీలించిన డీఎం

మండపేట, జూన్ 27: మండపేట ఏడిద రోడ్డులో వున్న సివిల్ సప్లయిస్ గోదాములను జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం ఎల్లారావు గురువారం పరిశీలించారు. గోదాములో సరుకు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సరుకు వివరాలతో పాటు సరుకు బరువు పరిశీలించారు. కోనసీమ జిల్లాలో ఏడు చోట్ల సివిల్ సప్లయిస్ గోదాములు ఉన్నాయన్నారు. మార్కెట్ కమిటీ గోదాములు, అద్దెకు తీసుకున్న గోదాముల్లో రేషన్ సరుకులు నిల్వ చేస్తున్నామన్నారు. జిల్లాలో 926 రేషన్ దుకాణాలు ఉన్నాయన్నారు. రేషన్ లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి బియ్యంతో పాటు పంచదార పంపిణీ చేస్తామన్నారు.

హామీల అమలుకు కృషి చేస్తా: ఎమ్మెల్యే గిడ్డి


గెయిల్ పైపులైను పేలుడు ఘటనలో మృతులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

మామిడికుదురు, జూన్ 27: నగరం గ్రామంలో గ్యాస్ పైపులైను పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల ఫొటోలతో ఏర్పాటు చేసిన చిత్రపటం వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం నివాళులర్పించారు. పేలుడు సంఘటన జరిగి నేటికి పదేళ్లు పూర్తయినా ఇప్పటివరకు ఆ సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేలుడు ఘటనలో 22మంది మృతిచెందడం బాధాకరమని, అప్పట్లో ప్రభుత్వాలు బాధితుల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఆ సమయంలో ఇచ్చిన హామీలు అమలకు అమలాపురం ఎంపీ, గెయిల్ అధికారులతో చర్చించి హామీలు అమలయ్యేలా కృషి చేస్తానన్నారు. హామీలు అమలు చేయకపోతే స్థానికులతో కలిసి పోరాడడానికి కూడా సిద్ధమని ఆయన తెలిపారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్‌లు జాలెం రమణకుమారి, అడబాల తాతకాపు, ఎంపీటీసీ జాలెం అనూష, నాయకులు జాలెం సుబ్బారావు, జాలెం శ్రీనివాసరాజా, ముఖర్రం హుస్సేన్, ఇంకా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అమరావతికి రూ.లక్ష విరాళం అందజేసిన కేబుల్ ఆపరేటర్లు



మండపేట, జూన్ 27: అమరావతి రాజధాని నిర్మాణానికి మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు రూ.లక్ష విరాళాన్ని గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు అందజేశారు. కేబుల్ ఆపరేటర్ల సంఘ నాయకుడు దూలం నాగేశ్వరరావు (నాగు) అధ్యక్షతన స్థానిక కాపుకల్యాణ మండపంలో ఆపరేటర్లంతా ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం విరాళం అందించారు. సమస్యలు పరిష్కరించాలని ఆపరేటర్లు వేగుళ్లను కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేబుల్ ఆపరేటర్ల మేడిశెట్టి వెంకటరమణ, పులగం రామకృష్ణారెడ్డి, రెడ్డి మాణిక్యం, సంఘ నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, టేకి అన్నవరం, దాసరి బాబి, అబ్బు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ముమ్మిడివరం, జూన్ 27: విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు నాశనమవుతుందని ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య పేర్కొన్నారు. తారా జూనియర్, డిగ్రీ కళాశాలలో వరల్డ్ యాంటీ డ్రగ్ డే సందర్భంగా గురువారం కళాశాల కరస్పాండెంట్ జీవీకే సుమంత్ అధ్యక్షతన జరిగిన అవగాహనా సదస్సులో సీఐ మాట్లాడారు. ఎవరైనా గంజాయి, మత్తుపదార్థాలు వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా టోల్ ఫ్రీ నంబరు 100 లేదా 112కు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. సదస్సులో ఎస్ఐ డి.సురేష్‌బాబు, కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా అధికారుల సస్పెన్షన్

రాజోలు, జూన్ 27: కడలిలో డ్వాక్రా యానిమేటర్ ఎ.దుర్గాభవానీ రూ.43 లక్షలు స్వాహా చేసిన వ్యవహారంలో పర్యవేక్షణా లోపం కారణంగా రాజోలు ఏపీఎం ఎస్తేరులీలా, క్లస్టర్ సీసీ వి.రాజబాబులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు జారీ చేశారని డీఆర్డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్ గురువారం తెలిపారు. గత నెలలో కడలిలో 34డ్వాక్రా సంఘాలకు చెందిన సొమ్ములు డ్వాక్రా యానిమేటర్ దుర్గాభవానీ బ్యాంకుకు జమ చేయకపోవడంతో అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు విచారణ చేపట్టగా యానిమేటర్ దుర్గాభవానీ చేతివాటమని ధ్రువీకరించారని తెలిపారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

పి.గన్నవరం,జూన్27: పి.గన్నవరం ప్రధాన పంటకాల్వ నుంచి ముంగండ తాగునీరు ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జె.కల్యాణచక్రవర్తి తెలిపారు. శుక్రవారం పి.గన్నవరం, పోతవరం, ముంగండ, ముంగండపాలెం, కె.ఏనుగుపల్లి, కె.ముంజవరం, వై.వి.పాలెం, ఆర్.ఏనుగుపల్లి, వైకొత్తపల్లి, లంకలగన్నవరం తదితర గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

ఫ్యాన్లు బహూకరణ

కె.గంగవరం,జూన్27: కె.గంగవరం ఉన్నతపాఠశాలకు ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు రూ.15వేలు విలువైన ఫ్యాన్లు బహూకరించారు. గురువారం పాఠశాలలో అందజేశారు. హెచ్ఎం పి.వెంకటేశ్వరరావుకు ఉపాధ్యాయులు పి.వి.బ్రహ్మానందం, ఏడుకొండలు, రాఘవకుమారి, సువర్చల పాల్గొన్నారు.

డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అల్లవరం, జూన్ 27: డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రత పాటిస్తూ శుభ్రమైన నీరు తాగాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ సూచించారు. గురువారం ఆయన కోడూరుపాడు హైస్కూలులో విద్యార్థులతో సమావేశమై సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఓవరహెడ్ ట్యాంకును పరిశీలించారు. హెచ్ఎం ఎ.శ్రీనివాసరావు, పీఈటీ యూవీ ముసలయ్య, పంచాయతీ కార్యదర్శి చిక్కం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ కౌన్సిల్ సభలను విజయవంతం చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 27: విజయవాడలో శనివారం జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్ సభలను విజయవంతం చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ కోరారు. గురువారం అంబేడ్కర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ నాయకులు ఎస్.సుబ్బారాయుడు, హర్ష, పి.బాలాజీ, సీహెచ్ లక్ష్మణ్, ఎస్.సూర్య, అజయ్ పాల్గొన్నారు.

మూడో ర్యాంకర్ సంజయ్‌కు అభినందనలు

అమలాపురం రూరల్, జూన్ 27: న్యూరాలజీ విభాగంలో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించి బెంగళూరు నిమ్‌హాన్స్ మెడికల్ కళాశాలలో సీటు సాధించిన సాకుర్రు గ్రామానికి చెందిన తాడికొండ సంజయ్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చొల్లంగి సత్యసాయిబాబా, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, ముత్తాబత్తుల వెంకటరమణ, పులవర్తి కృష్ణారావు, తాడికొండ తాతీయులు, తాడికొండ వెంకన్నబాబు పాల్గొన్నారు.

సగటున 16.6మిల్లీమీటర్ల వర్ష పాతం

అమలాపురం టౌన్, జూన్ 27: జిల్లాలో సగటున 16.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం మలికిపురంలో అత్యధికంగా 47.4మిల్లీమీటర్లు, కాట్రేనికోనలో అత్యల్పంగా 2.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 8.6, మండపేట 4, రాయవరం 12.8, రామచంద్రపురం 5.2, ఆలమూరు 6, రావులపాలెం 8.4, కొత్తపేట 19.2, కపిలేశ్వరపురం 6.8, కె.గంగవరం 4.4, ఐ.పోలవరం 5.2, ముమ్మిడివరం 4.2, అయినవిల్లి 9.8, పి.గన్నవరం 28.4, అంబాజీపేట 24.8, మామిడికుదురు 24.4, రాజోలు 44.2, సఖినేటిపల్లి 45.4, అల్లవరం 17.2, అమలాపురం 30.2, ఉప్పలగుప్తం మండలంలో 7.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పంచాయతీ వార్డు సభ్యుడి మృతి



ఆలమూరు, జూన్ 27: మండలంలోని నర్సిపూడి పంచాయతీ ఒకటో వార్డుసభ్యుడు ఉండమట్ల వీరన్న (45) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో సంతాప సభ ఏర్పాటుచేసి వీరన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

దేవస్థానం స్వీపర్ అనంతలక్ష్మి మృతి


అనంతలక్ష్మి

అంతర్వేది, జూన్ 27: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న పర్యాటక భవనం వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్ఎమ్మార్ జల్ల అనంతలక్ష్మి గురువారం మృతిచెందింది. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి రూ.10వేలు దహన సంస్కారాల నిమిత్తం అందజేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు అనంతలక్ష్మి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ

ఆధునిక వైద్య విధానాలను అందిపుచ్చుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 27: ఆధునిక వైద్య విధానాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అంతర్జాతీయ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వీకే రాజు పేర్కొన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో గురువారం విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అమెరికాలో 40ఏళ్లుగా వైద్య సేవలు అందించిన డాక్టర్ వీకే రాజు సేవలను పలువురుప్రశంసించారు. ఈసందర్భంగా డాక్టర్ రాజును చైతన్యరాజు సత్కరించారు. కార్యక్రమంలో కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్ వర్మ, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

అమలాపురంరూరల్, జూన్27: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించారు. కాలానుగుణంగా టెక్నాలజీలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఈసీఈ, ఈఈఈ విభాగాలు అత్యధికంగా ఉపయోగించే మేట్ ల్యాబ్ సాఫ్ట్‌వేర్ టూల్‌పై అధ్యాపకులకు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికుమార్ అవగాహన కల్పించారు. బోధనలో వస్తున్న మార్పులను అధ్యాపకులు గుర్తించాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న బీవీసీ గ్రూపు అధ్యాపకులకు సర్టిఫికెట్లను కళాశాలల చైర్మన్ బోనం కృష్ణసతీష్ అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ టి.ఫణి, ఎ.రాజగోపాల్, ఏవో జక్కం వెంకటకృష్ణారావు, కోఆర్డినేటర్లు డాక్టర్ ముత్తువేలు, పవన్ పాల్గొన్నారు.